క్లుప్తంగా

సమాజ సేవలో భాగస్వాములు కావాలి



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): సామాజిక సేవలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఎంపీడీవో రామకృష్ణనాయక్ పిలుపునిచ్చారు. జాకీర్‌హుస్సేన్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కొండపల్లి మున్సిపాలిటీలో సోమవారం నుంచి ప్రారంభమైన ప్రత్యేక శిబిరంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులు తరగతి గదులకే పరిమితం కాకుండా సామాజిక సేవలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ ఎస్.మహాభాష మాట్లాడుతూ.. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధనకు ఎన్ఎస్ఎస్ దోహద పడతాయన్నారు. ప్రత్యేక శిబిరంలో మొక్కలు నాటడం, వైద్యశిబిరాలు, పారిశుద్ధ్యం పనులు తదితరాలు నిర్వహిస్తామని చెప్పారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు నాగుల్‌మీరా, మస్తాన్‌వలి, జాఫర్ సాధిక్, విద్యార్థులు పాల్గొన్నారు.

బూడిద లారీల అడ్డగింత

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ బూడిద చెరువు వద్ద బూడిద లారీల లోడింగ్‌ను వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం అడ్డుకున్నారు. రెండు రోజుల క్రితం లారీల లోడింగ్ విషయమై మాట్లాడేందుకు జెన్‌కో విజిలెన్స్ డీఎస్పీ మెహర్‌బాబా కార్యాలయానికి వెళ్లగా ఆయన పరుష పదజాలంతో దూషించినట్లు మండల కన్వీనర్ బొంతా సాంబశివరావు తెలిపారు. ఆయన చెరువు వద్దకు వచ్చి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దుర్గగుడి పాలక వర్గం సభ్యులు చింకా శ్రీనివాసరావు, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు నల్లమోతు ప్రసన్నబోస్, మున్సిపల్ కౌన్సిలర్ గుంజా శ్రీనివాసరావు, గరికపాటి రాంబాబు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగు చేపట్టాలి



నూజివీడు: ప్రకృతి వ్యవసాయంలో రైతులు నవధాన్యాల సాగును చేపట్టాలని హనుమంతులగూడెం సర్పంచ్ యండ్రపాటి మల్లయ్య తెలిపారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామంలో సోమవారం నవధాన్యాల సాగు ఎంతో మేలు అని తెలియజేసే పోస్టర్‌ను సర్పంచ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన రహిత ప్రకృతి సేద్యమే ఎంతో మేలన్నారు. విచ్చలవిడిగా రసాయన ఎరువులు, మందులు వాడటం వల్ల పంట ఉత్పత్తులు కలుషితమైపోతున్నాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వరరావు, సచివాలయ గ్రేడ్–5 సెక్రటరీ ప్రసాద్, ఉద్యానశాఖ గ్రామ సహాయకులు నాగలక్ష్మి, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది తొమ్మండ్రు రుద్రయ్య, నాగమల్లేశ్వరరావు, వీవోఏలు రత్నకుమారి, ఝాన్సీ పాల్గొన్నారు.

డయాలసిస్ రోగులకు ఆర్థిక సాయం



చాట్రాయి: మండలంలోని చిన్నంపేట గ్రామానికి చెందిన అంబేడ్కర్ యువసేన ఆధ్వర్యంలో డయాలసిస్ రోగులకు సోమవారం ఆర్థిక సాయం అందించారు. గ్రామానికి చెందిన కొమ్ము రామకృష్ణ రెండేళ్లుగా కిడ్నీ సమస్యతో, కొమ్ము దేవదాసు పక్షవాతంతో బాధడుతుండడంతో ఒక్కొక్క కుటుంబానికి రూ.4,500 నగదు, 25 కేజీల బియ్యాన్ని అంబేడ్కర్ యువసేన నాయకులు అందజేశారు. కార్యక్రమంలో యువసేన నాయకులు బి.రామకృష్ణ, కె.ప్రతాప్, కె.నాగేశ్వరరావు, ఎం.ఆశా సుందర్‌కుమార్, కేవీపీఎస్ మండల కార్యదర్శి కొమ్ము ఆనందం పాల్గొన్నారు.

పాఠశాలల్లో సామాజిక తనిఖీపై శిక్షణ



చాట్రాయి: ప్రభుత్వ పాఠశాలల సామాజిక తనిఖీపై అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. మండల విద్యా శాఖ కార్యాలయంలో పాఠశాలల సామాజిక తనిఖీపై సోమవారం ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాఠశాలల మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజనం, విద్యా సదుపాయాలు, విద్యార్థులకు అందించే పాఠ్య పుస్తకాలు, దుస్తులు వంటి వాటిపై తనిఖీ చేసి యాప్‌లో నమోదు చేస్తారన్నారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ జి.అమరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ గ్రామ పంచాయతీలకు అవార్డులు



మండల పరిషత్ కార్యాలయంలో అవార్డు అందుకుంటున్న ధనేకుల చౌదరి



ముసునూరులో సర్పంచ్‌లను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు



ఏ.కొండూరు సర్పంచ్ రజినిని సన్మానిస్తున్న ఎంపీడీఓ నాగేశ్వరరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): మండల స్థాయిలో విజయవాడ రూరల్ మండలం పైడూరుపాడు గ్రామ పంచాయితీకి వాటర్ సఫిషియంట్ విలేజ్, ఉమెన్ ఫ్రెండ్లీ విభాగాల్లో రెండు అవార్డులు లభించాయి. జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం విజయవాడ రూరల్ మండలం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన పురస్కారాల ప్రధాన కార్యక్రమంలో పైడూరుపాడు గ్రామ సర్పంచ్ వేముల సీతారామయ్యకు విజయవాడ రూరల్ ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ కె.సువర్ణరాజు అందజేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో తమ గ్రామం ఉత్తమ పంచాయతీగా ఎన్నికయ్యేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వేమూరి సురేష్, ఇన్‌చార్జి ఎంపీడీఓ శేషగిరిరావు, కో ఆప్షన్ సభ్యుడు అల్తాఫ్, రైతు నాయకులు వై.నాగిరెడ్డి పాల్గొని సీతారామయ్యను అభినందించారు.

గొల్లపూడి పంచాయతీకి అవార్డు

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి గ్రామానికి మండల స్థాయి ఉత్తమ పంచాయతీ పురస్కారం లభించింది. విజయవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన పురస్కార ప్రధాన కార్యక్రమంలో 'స్వయం సమృద్ధితో మౌలిక సదుపాయాలు' గ్రామ పంచాయతీ విభాగంలో ప్రథమ పురస్కారాన్ని అందించారు. పురస్కారాన్ని ఎంపీటీసీలు ధనేకుల చౌదరి, పైలా ఆదినారాయణ, కో ఆప్షన్ సభ్యులు అల్తాఫ్‌లు జెడ్పీటీసీ కె.సువర్ణరాజు, ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, గొల్లపూడి స్పెషల్ ఆఫీసర్ శేషగిరిరావు చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా గొల్లపూడి గ్రామ పంచాయతీ సచివాలయం –1లో శానిటరీ సిబ్బందిని సత్కరించారు.

పుల్లూరు పంచాయతీకి రెండు అవార్డులు

మైలవరం: ఉమన్ ఫ్రెండ్లీ, చైల్డ్ ఫ్రెండ్లీ విభాగాల్లో పుల్లూరు గ్రామ పంచాయతీకి రెండు అవార్డులు దక్కాయి. మైలవరం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పుల్లూరు సర్పంచ్ కె.నాగమల్లేశ్వరి, కార్యదర్శి శైలజను ఎంపీడీఓ లక్ష్మీకుమారి ఆధ్వర్యంలో సత్కరించి, అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు అందిస్తున్నామన్నారు. జెడ్పీటీసీ ఎస్.తిరుపతిరావు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు పాల్గొన్నారు.

సర్పంచులకు సన్మానం

ఏ.కొండూరు: మండల స్థాయిలో ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రాలు అందించారు. మండలంలోని ఎనిమిది గ్రామ పంచాయతీల సర్పంచులకు అవార్డులు ప్రధానం చేశారు. ఎంపీడీవో నాగేశ్వరరావు, ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, జెడ్పీటీసీ భూక్య గనియా, గ్రామ సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర, జిల్లా స్థాయి అవార్డులు

జి.కొండూరు: మండల పరిధిలోని నాలుగు గ్రామ పంచాయతీలకు వివిధ విభాగాల్లో రాష్ట్ర,జిల్లా స్థాయి అవార్డులు దక్కాయి. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ చైల్డ్ ఫ్రెండ్లీ అవార్డు కుంటముక్కల గ్రామ పంచాయతీకి దక్కింది. జిల్లా స్థాయిలో దుగ్గిరాలపాడు గ్రామ పంచాయతీకి 'పేదరికంలేని మెరుగైన జీవనోపాధి' విభాగంలో ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు దక్కింది. తెల్లదేవరపాడు గ్రామ పంచాయతీకి 'పరిశుభ్రమైన, హరిత గ్రామ పంచాయతీ'గా, గడ్డమణుగు గ్రామ పంచాయతీకి 'గుడ్ గవర్నెన్స్' విభాగంలో అవార్డులు దక్కాయి. అవార్డులను విజయవాడలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఢిల్లీరావు చేతుల మీదుగా సర్పంచ్‌లు వంగూరి కుమారి కెనడీ, జడ రాంబాబు, ఉమ్మడి ప్రసాద్, ప్రత్తిపాటి రవీంద్ర కుమార్ సోమవారం అందుకున్నారు. సర్పంచ్‌లను, నాలుగు గ్రామ పంచాయతీలకు సెక్రటరీగా పనిచేస్తున్న రామకృష్ణను ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మందా జక్రధరరావు, ఎంపీడీఓ అనూరాధ అభినందించారు.

కనసానపల్లికి జిల్లా స్థాయి పురస్కారం

ఆగిరిపల్లి: మండలంలోని కనసానపల్లి గ్రామ పంచాయతీ గ్రామాభివృద్ధి ప్రణాళికలో భాగంగా నీటి సమృద్ధి కలిగిన గ్రామ పంచాయతీ విభాగంలో జిల్లా స్థాయి పురస్కారానికి ఎంపికైంది. ఏలూరులో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చేతుల మీదుగా సర్పంచ్ అమ్మిశెట్టి రమణ ఈ అవార్డును అందుకున్నారు. సర్పంచ్‌తో పాటు పంచాయతీ కార్యదర్శి బంగారు అంజలి పాల్గొన్నారు. సర్పంచ్‌ను ఎంపీపీ అనూషా ఇసాక్, జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు, ఎంపీడీవో కె.వాణి అభినందించారు.

జాతీయ నేతలు మన జాతి సంపదలు



ఇబ్రహీంపట్నంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

ఇబ్రహీంపట్నం: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్‌లు మన జాతీయ సంపదని వారిని గౌరవించడం మనందరి బాధ్యతని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. స్థానిక శక్తినగర్‌లో గుర్తుతెలియని దుండగులు పాక్షికంగా ధ్వంసం చేసిన విగ్రహాలకు సోమవారం క్షీరాభిషేకం చేసి నివాళులర్పించారు. దోషులను కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు. విగ్రహాల ధ్వంసం విషయంలో దేవినేని ఉమా తీరుపై ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మండిపడ్డారు. దీనిపై నీచ రాజకీయాలు చేయడం ఉమాకే చెల్లిందన్నారు. పుష్కరాల సమయంలో రోడ్డుకు అడ్డుగా ఉందని మహాత్మాగాంధీ విగ్రహం అర్ధరాత్రి పెకిలించి మురికిగుంతలో పడేపించాడని, పాదరక్షలు వేసుకుని జాతీయ నేతలను అవమానించే ఉమా రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, ఎంపీపీ పాలడుగు జోత్స్న, అంకే అంకమోహనరావు, నల్లమోతు చిన్నయ్య, ప్రకాష్, దయాకర్, వార్డు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం



ఆగిరిపల్లిలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చంద్రాల(మైలవరం): మహాత్మాగాంధీ కలలు కన్నా గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధర్ పేర్కొన్నారు. మైలవరం మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. చంద్రాలలో సర్పంచ్ జే.జ్యోతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గంగాధరరావు మాట్లాడుతూ.. దేశాభివృద్ధికి మూలం గ్రామాల అభివృద్ధేనన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛభారత్ కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ శ్రావణి, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి దుర్గా మౌనిక, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. మైలవరంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి, ఉప సర్పంచ్ సీతారెడ్డి, కార్యదర్శి సాంబశివరావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఎంపీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ పాలడుగు జోత్స్న, ఎంపీడీవో రామకృష్ణనాయక్ మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. గ్రామ పంచాయతీలకు సర్టిఫికెట్లు అందజేశారు.

నూజివీడు: పంచాయతీరాజ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ప్రజాప్రతినిధులపై ఉందని నూజివీడు ఎంపీపీ ఆరేపల్లి శిరీష అన్నారు. సర్పంచ్‌లకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా బోర్వంచ, దిగవల్లి, దేవరగుంట, పాతరావిచర్ల, పోతురెడ్డిపల్లి, సీతారామపురం, రావిచర్ల, ముక్కొల్లుపాడు, మీర్జాపురం, కొత్తూరు తండా, గొల్లపల్లిలలకు పలు విభాగాల్లో మండల స్థాయిలో పురస్కారాలకు ఎంపికయ్యారు. సర్పంచ్‌లను సన్మానించారు. ఈవోపీఆర్డీ టి.సరస్వతి, సర్పంచ్‌లు కుంటం ఉదయరాజు, కెత్తే నాని, బసవరాజు అన్నపూర్ణమ్మ, పల్నాటి అనూష, తగరం సుజాత, కంచర్ల సుబ్బలక్ష్మి, నాయకులు ఆరేపల్లి రాంబాబు, పల్నాటి రఘు, అక్కినేని ప్రేమసాయి, ఎంపీడీవో కార్యాలయ ఏవో బేబీ, సెక్రటరీలు, సచివాలయ గ్రేడ్–5 సెక్రటరీలు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ఎంపీడీవో కె.వాణి ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. పలు విభాగాల్లో ఆగిరిపల్లి, ఎస్‌పేట, ఈదులగూడెం, అడవినెక్కలం, నెక్కలం గొల్లగూడెం, అమ్మవారిగూడెం, చిన్న ఆగిరిపల్లి పంచాయతీలు ఉత్తమ పంచాయతీలుగా ఎంపికయ్యాయి. సర్పంచ్‌లకు ధ్రువీకరణ పత్రాలను ఎంపీడీవో, జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు చేతుల మీదుగా అందజేసి సత్కరించారు. కనసానపల్లి పంచాయతీ జిల్లా స్థాయి పురస్కారానికి ఎంపికైన సందర్భంగా సర్పంచ్ అమ్మిశెట్టి రమణ సంజీవరావును సత్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ బి.ప్రసాద్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మైలవరం: సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. పంచాయతీ కార్మికులను సన్మానించారు.

తిరువూరు: మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. పంచాయతీరాజ్ చట్టం గురించి పంచాయతీ కార్యదర్శులు వివరించారు. రోలుపడి, కోకిలంపాడు, గానుగపాడు, జీకొత్తూరు, చౌటపల్లి, ఆంజనేయపురం, కొమ్మిరెడ్డిపల్లి గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

తిరువూరు: ఎంపీపీ గద్దల భారతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండలంలో గ్రామ పంచాయతీల ప్రగతిని ఇన్‌చార్జి ఎంపీడీవో నాగేశ్వరరావు వివరించారు. ఈవోపీఆర్డీ వెంకటరత్నం, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

ముసునూరు: పంచాయతీరాజ్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని జెడ్పీటీసీ సభ్యులు వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీ సత్యనారాయణ అధ్యక్షతన పంచాయతీరాజ్ దినోత్సవం సోమవారం సాయంత్రం నిర్వహించారు. కొర్లగుంట, లోపూడి, రమణక్కపేట, గుళ్లపూడి, వలసపల్లి, ముసునూరు, చెక్కపల్లి, కాట్రేనిపాడు, అక్కిరెడ్డిగూడెం, సూరేపల్లి సర్పంచ్‌లను సత్కరించి, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు బహూకరించారు. తహసీల్దార్ సుధ, సొసైటీ అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, రాపర్ల సుబ్బారావు, కార్యాలయ పర్యవేక్షకుడు సాయిరాము, కార్యదర్శులు ఆరేపల్లి వెంకటేశ్వరరావు, జంగం యోహాను, స్రవంతి, ఎంపీటీసీలు, నేతలు, అధికారులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలను గడువులోగా పరిష్కరించండి

సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అర్జీలను పరిశీలిస్తోన్న సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

నూజివీడు: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను గడువులోగా సంబంధిత అధికారులు పరిష్కరించాలని సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. స్పందనలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై 10 అర్జీలు అందాయన్నారు. వీటిలో ఎక్కువగా నూతన పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని, ఆక్రమణలు తొలగించాలని, తమ భూములను సర్వే చేయాలని, పట్టణంలో, మండలంలో ఏర్పాటు చేసిన బ్యానర్‌లను తొలగించాలని కోరుతూ అర్జీలు వచ్చాయని చెప్పారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ.. స్పందనలో వచ్చిన అర్జీలను పరిష్కరిస్తేనే రాష్ట్ర ప్రభుత్వ ఆశయం, ఈ కార్యక్రమం లక్ష్యం నెరవేరినట్లవుతుందన్నారు. స్పందనను ప్రతి వార్డు, గ్రామ సచివాలయాల్లో ప్రతి రోజూ సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తున్నారని, అక్కడ కూడా ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందజేయవచ్చని చెప్పారు. స్పందనలో డీఎల్‌పీవో పి.వెంకటరత్నం, ట్రాన్స్‌కో టౌన్ డీఈ ఓలేటి దుర్గారావు, ఏడీఏ విద్యాసాగర్, ఉద్యాన శాఖ అధికారిణి ఆర్.హేమ, ఆర్‌అండ్‌బీ డీఈ బాబూరావు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయంలో 'స్పందన'

తిరువూరు: స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. తన ఆస్తులను రాయించుకున్న భార్యాపిల్లలు తనను ఇంటి నుంచి గెంటివేశారని అశోక్‌నగర్‌కు చెందిన సింగంశెట్టి వరప్రసాద్ ఆర్డీవో ప్రసన్నలక్ష్మికి ఫిర్యాదు చేశారు. పలువురు రైతులు రెవెన్యూ సంబంధ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.

స్పందనలో 2 అర్జీలు

గంపలగూడెం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. లింగాలలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం క్షేత్రసహాయకుడు అక్రమాలకు పాల్పడుతున్నాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. కనుమూరుకు చెందిన రేగళ్ల భవాని రేషన్ కార్డు మంజూరు చేయాలని అర్జీ అందజేశారు. ఎంపీడీవో పిచ్చిరెడ్డి, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

చెత్త సంపద తయారీ కేంద్రాల పనితీరు మెరుగుపర్చాలి



మైలవరంలో స్థానిక అధికారులతో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి సునీత

మైలవరం: గ్రామాల్లో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో పనితీరును మెరుగుపర్చాలని జిల్లా పంచాయతీ అధికారి సునీత ఆదేశించారు. మైలవరంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆమె సోమవారం సందర్శించారు. పంచాయతీ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీల నిర్వహణకు తగిన సొమ్ములు సమకూర్చాలన్నారు. ముందుగా స్వయం సహాయక సంఘాలు, గ్రామైక్య సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. రుణాలు తీసుకున్న సభ్యులు తిరిగి చెల్లించాలని, దీని వలన తరువాత వచ్చే వారికి రుణాలు మంజూరు చేసే అవకాశం ఉంటుందని, అంతేగాక బాకీలు తిరిగి చెల్లించడం ద్వారా మళ్లీ ఎక్కువ మొత్తంలో రుణాలు మంజూరు చేస్తామన్నారు. రుణాలు తీసుకున్న మహిళలు చిన్న వ్యాపారాల ద్వారా తమ కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీడీ శ్రీనివాసరావు, సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి, కార్యదర్శి సాంబశివరావు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుంటే వాహనం నడిపితే జరిమానా



తుక్కులూరు వై.జంక్షన్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ అంకబాబు

నూజివీడు: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా వాహనాన్ని నడిపితే జరిమానా విధిస్తామని నూజివీడు రూరల్ సీఐ రాజులపాటి అంకబాబు హెచ్చరించారు. మండలంలోని తుక్కులూరు వై.జంక్షన్ వద్ద సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ వాహనదారులకు హెల్మెట్ ధరించడంపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల్లో 90 శాతం మంది క్షతగాత్రులు తలకు దెబ్బలు తగలడం వల్లనే ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రమాదం జరిగి ఒక వ్యక్తి చనిపోతే కుటుంబమంతా అల్లకల్లోలమవుతుందని చెప్పారు. వాహనదారులు హెల్మెట్‌ను ధరించినట్లయితే ఒక వేళ ప్రమాదం సంభవించినా ప్రాణాపాయం తప్పుతుందన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, అలా ఇచ్చినప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే వాహన యజమానిపై కూడా కేసు నమోదు చేస్తామని చెప్పారు.

జడ్జి షిరీన్‌కు ఘనంగా వీడ్కోలు



జడ్జి షిరీన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న న్యాయవాదులు

మైలవరం: ఇటీవల మైలవరం జూనియర్ సివిల్ కోర్టు నుంచి బదిలీ అయిన జడ్జి షేక్ షిరీన్‌కు స్థానిక మైలవరం బార్ అసోసియేషన్ హాలులో న్యాయవాదులు సోమవారం ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. మైలవరం జూనియర్ సివిల్ జడ్జి షేక్ షిరీన్ కాకినాడ ఐదో జూనియర్ జడ్జిగా బదిలీపై వెళ్తున్నారు. ఈ సందర్భంగా జడ్జి షిరీన్ మాట్లాడుతూ మైలవరం కోర్టులో పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ ప్రాంతాన్ని మరువలేమని, న్యాయవాదులు పూర్తి తోడ్పాటుతో ఇక్కడ తన పదవీ కాలం పూర్తయిందన్నారు. మైలవరం బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బుద్ధవరపు వెంకట్రావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో జడ్జి షిరీన్‌ను ఘనంగా సత్కరించారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు పి.పద్మశ్రీ, సీనియర్ న్యాయవాదులు పి.వి.శేషగిరిరావు, ఎస్‌వీకే సత్యనారాయణరావు, పి.రామకృష్ణ, ఏడీ ప్రసాద్, వి.టి.కిశోర్, ఓర్సు శ్రీనివాసరావు, ఎం.ఆంజనేయులు, ఆర్.రమేష్‌బాబు, ముల్లంగి రవికుమార్, పి.రవికిశోర్, డి.సురేష్, ఎం.తనూజ్, దినేష్, ప్రభుత్వ న్యాయవాది పజ్జూరు వెంకట సాంబశివరావు, ఏపీపీ షేక్ హమీద్ పాల్గొన్నారు.

సేవలు చేరువ చేసేందుకే సచివాలయాల ఏర్పాటు



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే రక్షణనిధి

విస్సన్నపేట: ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువ చేసేందుకే సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చామని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. స్థానిక గ్రామసచివాలయం –3 నూతనభవనం, ఆంధ్రకేసరి రైతు ఉత్పత్తిదారుల మామిడి ప్రాసెసింగ్ కేంద్రాన్ని ఎమ్మెల్యే సోమవారం సాయంత్రం ప్రారంభించారు. రైతులు, ఎఫ్‌పీఓ సంఘాల రైతులకు సౌకర్యార్థం మామిడి ప్రాసెసింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని రైతులు సద్వినియోగించుకోవాలన్నారు. అర్హులందరికీ నివేశన స్థలాలు పంపిణీ చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి మేర్సీవనజాక్షి, జెడ్పీటీసీలు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, యరమల రామచంద్రారెడ్డి, ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ, తహసీల్దార్ లక్ష్మి, ఏసీ రాజశ్రీ, సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, నాయకులు ఓలేటి దుర్గారావు, సిరసాని ప్రకాష్, నెక్కళపు కుటుంబరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ఇబ్రహీంపట్నానికి చెందిన వ్యక్తిగా గుర్తింపు

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయరహదారిపై సోమవారం గుర్తుతెలియని వాహనం ఢీకొట్టగా ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాలు.. ఇబ్రహీంపట్నానికి చెందిన తాడిబోయిన వెంకట నవీన్(25) మంగళగిరి రూరల్ పరిధిలోని నిడమర్రు గ్రామంలో నివాసముంటున్న తన తాతయ్యను చూసేందుకు ఇబ్రహీంపట్నం నుంచి ద్విచక్రవాహనంపై నిడమర్రు వెళుతున్నాడు. తాడేపల్లి సాయిబాబా గుడివద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టగా మృతి చెందాడు. ఇబ్రహీంపట్నంకు చెందిన వెంకట నవీన్ తండ్రి 6 సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి తల్లి వరలక్ష్మితో కలసి ఉంటున్నాడు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. వెంకట నవీన్ ఒక్కడే కుమారుడు కావడంతో తల్లి వరలక్ష్మి అస్వస్థతకు గురైంది. ఆమెను చికిత్స నిమిత్తం విజయవాడలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో బంధువులు చేర్పించారు. నవీన్ మృతికి కారణమైన వాహనం ఆటోగా గుర్తించామని, ఆటో ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చాట్రాయి: రోడ్డుప్రమాదంలో గాయాలపాలై చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని జనార్దనవరం గ్రామానికి చెందిన దారా నైసు(45) ఈ నెల 19న ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా చిత్తపూరు గ్రామం వద్ద వ్యాన్ ఢీ కొట్టింది. ఈ సంఘటనలో నైసు తలకి గాయాలు కావడంతో విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

కొత్తరావిచర్లలో నేడు గడప గడపకు మన ప్రభుత్వం

నూజివీడు: మండలంలోని కొత్త రావిచర్లలో మంగళవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. దీనిలో భాగంగా ఎమ్మెల్యే ప్రతాప్ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల వల్ల కలిగిన లబ్ధిని ప్రజలకు వివరిస్తారని పేర్కొన్నాయి. కార్యక్రమంలో అధికారులు, వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొనాలని కోరారు.

సైన్స్ మహోత్సవ్‌లో విద్యార్థుల ప్రతిభ

తిరువూరు: రామన్ సైన్స్ మహోత్సవ్‌లో భాగంగా ఈ–అభ్యాస్ అకాడమీ నిర్వహించిన ఐఐటీ రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలో తిరువూరు శ్రీనిధి స్కూల్ విద్యార్థులు పలు బహుమతులు గెలుచుకున్నారు. పాఠశాల విద్యార్థులు సాత్విక, చందన, నందిని, యోగితాలక్ష్మి రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ వెంకటనారాయణ తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఉపాధ్యాయులు, స్కూల్ సిబ్బంది అభినందించారు.